

ట్రిపుల్ ఐటికి పెదతాడేపల్లి గురుకుల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెదతాడేపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటిల్లో సీట్లు సాధించారని ఆ పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.బాబీ, ఐ.వెంకట్ ఒంగోలు ట్రిపుల్ ఐటికి, వి.సురేష్‌కుమార్, కె.కార్తీక్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. తమ స్కూల్ నుండి ఒకే బ్యాచ్‌లో నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీట్లు పొందడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులను డిసిఒ ఎన్.భారతి, ఉపాధ్యాయులు అభినందించారు.



ఖరీఫ్ నాట్లు.. ఆలస్యం..!

- రెండు జిల్లాల్లో 3 లక్షల ఎకరాలకుపైగా వరిసాగు
- ఇప్పటికీ ఐదుశాతం పూర్తి కాని నాట్లు
- నీటి ఎద్దడి సమస్యతో రైతుల అవస్థలు
- వర్షాల రాకతో గోదావరి నుంచి నీటి విడుదల పెంపు
- ఆగస్టులోనూ నాట్లు సాగే పరిస్థితి
- కౌలురైతులకు రుణాల మంజూరులో నిర్లక్ష్యమే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్‌లో ముందస్తు సాగు ప్రణాళికలు విఫలమయ్యాయి. జులైలో సగం రోజులు గడిచినా ఇప్పటికీ ఐదు శాతం నాట్లు కూడా పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఆగస్టు వరకూ నాట్లు పూర్తయ్యే పరిస్థితి లేదని అధికారులే చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2.13 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో లక్షా 15 వేల ఎకరాలు మొత్తం 3.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ కేవలం పది వేల ఎకరాల్లో అంటే ఐదు శాతం కూడా నాట్లు పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలోనూ దాదాపు అదే పరిస్థితి ఉంది. దీంతో ఖరీఫ్ నాట్లు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేసి ముందస్తు సాగుకు ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. వేసవి వేడిగాలులు తగ్గకపోవడంతో రైతులు నారుమడులు వేసేందుకు వెనుకంజ వేశారు. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో నారుమడులు మరింత ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం నారు చేతికొచ్చినా నీటిఎద్దడి సమస్యతో నాట్లు ముందుకు సాగని దుస్థితి నెలకొంది. వర్షాలు కురవకపోవడంతో సాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి రోజుకు మూడు వేల క్యూసెక్కుల నీరు సైతం వదలని పరిస్థితి ఏర్పడింది. గోదావరి జలాలు లేకపోవడంతో సీలేరు నుంచి వస్తున్న నీటినే వదిలారు. దీంతో దుక్కులకు నీరు చాలక నాట్లు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దీంతో నాట్లు సకాలంలో పడని దుస్థితి ఏర్పడింది. గడిచిన రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు కురవడం, గోదావరి నీటిప్రవాహం పెరగడంతో రైతులకు కొంత ఊరట లభించింది. ప్రస్తుతం రోజుకు ఏడు వేల క్యూసెక్కుల నీటిని గోదావరి నుంచి విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. సాగునీరు పూర్తిస్థాయిలో వస్తుండటంతో దమ్ములకు ఇబ్బంది తొలగనుంది. దీంతో నాట్లు ఊపందుకునే పరిస్థితి ఉంది. ఏదేమైనా అధికారుల లెక్కల ప్రకారం ఆగస్టు రెండోవారం వరకూ ఖరీఫ్ నాట్లు కొనసాగే పరిస్థితి ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్ నాట్లు ఆలస్యంతో ఈ ప్రభావం రబీ సాగుపైనా పడనుంది. నాట్లు ఆలస్యం అవుతుండటంతో ఖరీఫ్ మాసూళ్లు సైతం నవంబర్, డిసెంబర్‌ల్లో రానున్నాయి. పంట తుఫాన్ల బారిన పడే ప్రమాదం ఉందని రైతులు లోలోన ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఖరీఫ్ నాట్లు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు రైతులను సమాయత్తం చేయాల్సి ఉంది.

కౌలురైతుల పట్ల కొనసాగుతున్న నిర్లక్ష్యం

రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో వీరిదే కీలకపాత్ర. ప్రభుత్వం మాత్రం కౌలురైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రతియేటా మాదిరిగానే ఈ ఏడాదీ కౌలుకార్డుల జారీలోనూ, రుణాల మంజూరులోనూ నిర్లక్ష్యమే కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో 48 వేల వరకూ కౌలుకార్డులు ఇవ్వాలని టార్గెట్‌గా పెట్టుకుని ఇప్పటి వరకూ 38 వేలు ఇచ్చినట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. కౌలురైతులకు బ్యాంకు రుణాల మంజూరు గురించి ఏఒక్క అధికారీ నోరు మెదపడం లేదు. 2022లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో బ్యాంకుల నుంచి పంట రుణాలు అందుకున్న రైతులు అతి తక్కువ మంది ఉన్నారు. ఈ ఏడాది కూడా కౌలురైతులకు అన్యాయం చేసే పరిస్థితులు కన్పిస్తున్నాయి. త్వరితగతిన కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తి చేసి, కౌలురైతులకు పంట రుణాలు అందిస్తే అన్నదాతకు మేలు జరుగుతుంది. లేనిపక్షంలో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో కౌలురైతులు చిక్కుకుపోనున్నారు.



పవన్‌కు గజమాల వేస్తున్న అభిమానులు

అవినీతి ఊబిలో తణుకు మంత్రి

సిపిఎస్ రద్దుపై మాటమార్చిన జగన్

తణుకు సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - భీమవరం, తణుకు రూరల్

తణుకులో మంత్రి భారీ అవినీతికి పాల్పడుతున్నారని, సమస్యలు చెప్పుకోబోయిన రైతులను 'ఎర్రి..' అని సంబోధించి అవమానించడంలో ముందున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విమర్శించారు. రాజకీయాల్లో అవినీతిని పారదోలేందుకు జనసేన కృషి చేస్తుందన్నారు. జనం బాగుండాలంటే వైసిపి పోవాలని, దానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ నెల 9న ఏలూరు జిల్లాలో ప్రారంభమైన వారాహి విజయయాత్ర రెండో దశ పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శుక్రవారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలోని పైడిపర్రు సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే 72 మంది భవన నిర్మాణ కార్మికుల ఉసురు తీసిందన్నారు. సుమారు రూ.900 కోట్లు భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమనిధిని దోచేసిందని విమర్శించారు. ఇంటి పన్ను రూ.ఆరొందలు పెంచారని, చెత్త పన్ను రూ.వంద వేశారని, నిత్యావసరాల ధరలు గతంతో పోలిస్తే ఆకాశాన్నంటాయని విమర్శించారు. మద్యపాన నిషేధం అని చెప్పి రూ.30 వేల కోట్లు దోచేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్షా 60 వేల బెల్టుషాపులుంటే ప్రస్తుతం మూడు లక్షల బెల్టు షాపులు నడుస్తున్నాయని ఆరోపించారు. దీనివల్ల 52 వేల మంది మహిళలపై మద్యం మత్తులో దాడులు జరిగాయన్నారు. దీనిపై మహిళా కమిషన్, మహిళా మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో అత్యధికంగా గంజాయిని ఎపినే రవాణా చేస్తుందని నివేదికలు చెబుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన జగన్ మాట మార్చారని, అబద్దాలు సమర్థించుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సమయానికి జీతాలు ఇవ్వకపోవడమే కాకుండా టిఎ, డిఎలు అందించడం లేదని, చివరికు పిఎఫ్ సొమ్ము కూడా దోచేయడం దారుణమన్నారు. వలంటీర్లు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నారని, తనకు వారంటే కోపం లేదని అన్నారు. లాలూ ప్రసాద్‌యాదవ్, జయలలిత వంటి మాజీ సిఎంలు, ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మి వంటి వారు జైలుకెళ్లారని, వ్యక్తిగత సమాచారం సేకరించే వాలంటీర్లు కూడా శిక్షార్హులని అన్నారు. జగన్ ప్రభుత్వం లేనప్పుడు సంక్షేమ పథకాలు అమలయ్యేవని, వైసిపి ప్రభుత్వం చేసిందేమిటని ప్రశ్నించారు. తణుకులో మంత్రి ఇళ్ల స్థలాల పూడిక పేరుతో సుమారు రూ.55 కోట్లు దోచేశారన్నారు. టిడిఆర్ బాండ్ల పేరుతో మరో రూ.309 కోట్లు కాజేశారని ఆరోపించారు. దీనిపై ఎసిబి, సిఐడి విచారణ పేరుతో మున్సిపల్ కమిషనర్‌ను బలి చేశారని, వెనుక ఉన్న పెద్దలు బాగానే ఉన్నారని అన్నారు. పట్టణంలో డంపింగ్ యార్డు లేదని, ఎక్కడ చెత్త అక్కడే ఉన్నా ఈ చెత్త ప్రభుత్వం చెత్త పన్ను వేస్తుందని విమర్శించారు. ఆర్‌బికెలు కూడా పూర్తిస్థాయిలో లేవన్నారు. 12 గ్రామ సచివాలయాల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారని, కాంట్రాక్టర్లకు డబ్బులివ్వకపోవడమే దీనికి కారణమన్నారు. ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేశారన్నారు. కనీసం కాల్వ పనులు చేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు కూడా అందించలేకపోతున్నారన్నారు. నిడదవోలు నుంచి తణుకు వరకూ ఉన్న మూడు కాల్వలకు రూ.30 కోట్లు వెచ్చిస్తే రైతులకు మేలు చేకూరుతుందన్నారు. మద్దతు ధర కోరిన అడిగిన పాపానికి దువ్వకు చెందిన 24 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు ఐదు కిలోలు ధాన్యం, రూ.50 నుంచి రూ.వంద వరకూ అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. అయినా పట్టించుకున్న నాథుడు లేడన్నారు. తొలుత హోటల్ చిట్టూరి హెరిటేజ్ నుంచి పైడిపర్రు సెంటర్ వరకూ మూడు కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ కన్వీనర్ విడివాడ రామచంద్రరావు, నేతలు పాల్గొన్నారు.

సరసమైన ధరకే బియ్యం పంపిణీ : కలెక్టర్

రైతు బజార్‌లో బియ్యం స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందజేసే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు బజార్ వద్ద జిల్లా యంత్రాంగం నిర్దేశించిన రేట్లకే నాణ్యమైన బియ్యం అమ్మకానికి ఏర్పాటు చేసిన స్టోర్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో బియ్యం రేట్లను నియంత్రించేందుకు సివిల్ సప్లయ్ అధికారులు, ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, హోల్ సేల్ బియ్యం వ్యాపారులు సమన్వయంతో ప్రభుత్వ స్టోర్‌లో బియ్యం అమ్మకాలను ప్రారంభించినట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్లో ధరకు ప్రభుత్వ స్టోర్ ధరకు పది రూపాయల వరకూ వ్యత్యాసం ఉందన్నారు. బహిరంగ మార్కెట్లో సాధారణ రకం రూ.42, ఫైన్ రకం రూ.45, సూపర్ ఫైన్ రకం రూ.55 ఉండగా, ప్రభుత్వ స్టోర్‌లో వరుసగా రూ.34, రూ.40, రూ.46 ధరలు నిర్ణయించి అమ్మకాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. జెసి మాట్లాడుతూ తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు పట్టణాల్లో ఈనెల 15వ తేదీన బియ్యం స్టోర్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, మెప్మా పీడీ గ్రంధి పార్వతి, హార్టికల్చర్ ఎడి దుర్గేష్, మార్కెటింగ్ ఎడి కె.సునీల్ కుమార్ పాల్గొన్నారు.



రైతు బజార్‌లో తొలి బియ్యం అమ్మకాల షాపును ప్రారంభిస్తున్న కలెక్టర్, జెసి

వలస కార్మికుల బతుకులు దయనీయం

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

జంతువుల కన్నా హీనమైన పరిస్థితుల్లో వలస కార్మికుల జీవితాలు ఉన్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. గురువారం ఆరేడు గ్రామంలో చెరువులపై పనికి వచ్చిన ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు టాటాఏస్ ఢీకొట్టగా ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మరణించిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబీకులను సిఐటియు నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది వలస కార్మికులు ఆక్వారంగం, ఇతర రంగాల్లో పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వద్ద ఎంత సంఖ్యలో వలస కార్మికులు ఉన్నారో లెక్కలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. వలస కార్మికుల ప్రాణాలు పిట్టల వలె రాలిపోతున్న మానవతా దృక్పథంతోనూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినా అధికారులు తమకేమీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కారుచౌకగా ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకొని కనీస వసతులు కల్పించకుండా, కనీస జీతం ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వలస కార్మికులకు అనేక చట్టాలున్నా క్షేత్రస్థాయిలో ఏవీ పనికిరాని కాగితాలుగా మారిపోయాయన్నారు. రానున్న కాలంలో వలస కార్మికుల కోసం పెద్దఎత్తున ఆందోళన చేపట్టబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, ఉండి మండల కార్యదర్శి ధనుకొండ శ్రీనివాస్, ఆక్వా పరిశ్రమల వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.కోటేశ్వరరావు, నేత అల్లూరి అరుణ్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

'నాడు-నేడు' హాస్టళ్లకూ వర్తింపజేయాలి

సైకిల్‌యాత్రలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.పావని

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

'నాడు-నేడు'ను హాస్టళ్లకూ వర్తింపజేసి సొంత భవనాలను నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.పావని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ఐదోరోజు శుక్రవారం పట్టణంలో కొనసాగింది. యాత్ర గురువారం రాత్రి తాడేపల్లిగూడెం చేరుకోగా పలు హాస్టళ్లను నేతలు సందర్శించారు. బిసి బాలికల వసతిగృహంలో విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో శ్లాబ్ నుంచి నీరు కారుతోందని, పై పెచ్చులూడి పడుతున్నాయని విద్యార్థినులు వాపోయారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న శ్రద్ధ విద్యాలయాలపై లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కువ శాతం హాస్టళ్లు అద్దె భవనంలో నడుపుతున్నారన్నారు. భవనాల నిర్వహణకు ప్రభుత్వం సరిపడా సొమ్ము చెల్లించడం లేదని, ఫలితంగా హాస్టల్లో ఉండే విద్యార్థులు అనేక ఇబ్బందుల పాలవుతూ అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం పలు పాఠశాలలను, కళాశాలలను యాత్ర బృందం సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ జెడ్‌పి పాఠశాల ఆవరణలో ఉన్న జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవన్నారు. ప్రభుత్వం తరగతి గదులు నిర్మించకపోవడం దుర్మార్గమన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదని, పాఠశాల విద్యార్థులకు మెస్‌ఛార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందజేయాలని కోరారు. అనంతరం పెంటపాడు జూనియర్, డిగ్రీ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పి.వాసు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణం రెండేళ్లుగా అసంపూర్తిగా ఉండటం దారుణమన్నారు. డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఎంచుకునే స్వతంత్రత ఇవ్వాలని, ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవసరమైన వసతులు అన్ని జిల్లాల్లో ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు టి.రవిబాబు, పి.నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్‌డి.జాన్, నాయకులు సింధు, శ్రీను, చిరంజీవి, ఈశ్వర్, శ్రీకాంత్, సాయిలాల్ పాల్గొన్నారు.

తరగతి గదులను వినియోగంలోకి తీసుకురావాలి

గణపవరం: గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్మాణం పూర్తయిన తరగతి గదులను వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.పావని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర శుక్రవారం గణపవరం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు, డిగ్రీ, జూనియర్ కాలేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడగా నేతలు ఎమ్‌డి.జాన్, టి.ప్రసాద్, సింధు, శ్రీను, చిరంజీవి, గణేష్, ఈశ్వర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాస్ట్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించండి

రైల్వే అధికారులకు ఎంపీ కనుమూరి లేఖ

ప్రజాశక్తి - ఉండి

నరసాపురం నుండి విజయవాడ వెళ్లేందుకు దిగువ మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే పాస్ట్ ప్యాసింజర్ రైలును వెంటనే పునరుద్ధరించాలని నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు రైల్వే అధికారులను కోరారు. ఈ మేరకు రైల్వే శాఖ అధికారులకు లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నరసాపురం నుండి ఉదయం బయలుదేరే పాస్ట్ ప్యాసింజర్ రైలులో నిత్యం వందలాది మంది ప్రయాణికులు విజయవాడ, గుంటూరు వైపు వెళ్తున్నారని పేర్కొన్నారు. పాస్ట్ ప్యాసింజర్ రైలును ఆపేయడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పాస్ట్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని కోరారు.

ఐక్యంగా పోరాడితేనే గిట్టుబాటు ధర

రొయ్య రైతుల సమావేశం పిలుపు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి ఐక్యంగా పోరాడాలని పాలకొల్లు ఎఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు కోరారు. స్థానిక ఎస్-ఎస్ఎస్ కల్యాణ మండపంలో ఆక్వా రైతుల జిల్లా సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో భగవాన్‌రాజు మాట్లాడుతూ రొయ్యల రైతులు ఐక్యంగా లేకపోవడంతో గిట్టుబాటు ధరలు దక్కక నష్టాల బారిన పడుతున్నారని చెప్పారు. ప్రాసెసింగ్ యూనిట్లు, ఫీడ్, హేచరీలు రైతులను దోచేస్తున్నాయని, రైతులు ఐక్యంగా పోరాడి గిట్టుబాటు ధర సాధిస్తే నష్టాల ఊబి నుంచి గట్టెక్కుతారని చెప్పారు. ప్రతియేటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు క్రాప్‌హాలిడే ప్రకటించాలని ఆయన కోరారు. గిట్టుబాటు ధర రాకపోతే అవసరమైతే ఒక ఏడాది క్రాప్‌హాలిడే ప్రకటించాలని, అప్పుడు ప్రభుత్వంతోపాటు అన్ని ఫ్యాక్టరీలూ దిగొస్తాయని చెప్పారు. మరో రైతు బోణం చినబాబు మాట్లాడుతూ నాణ్యమైన సీడ్ హేచరీస్‌లో దొరక్క రైతులు ఆదిలోనే నష్టపోతున్నారన్నారు. రైతుల సమస్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని రైతు పెన్మెత్స సత్యనారాయణరాజు చెప్పారు. ఆక్వా జోన్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేస్తోందని జాన్‌రాజు విమర్శించారు. ప్రాసెస్, ఫీడ్, సీడ్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి సహకరించని వారిని రైతులు బహిష్కరించాలని కోడి విజయభాస్కర్ కోరారు. రొయ్యల్లో అనేక పోషకాలు ఉన్నాయని, స్థానికంగా కూడా వాడకం పెరిగితే రొయ్యల రైతులు నష్టాల నుంచి గట్టెక్కుతారని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాంధీ భగవాన్ రాజు

హాస్టల్ విద్యార్థిపై కుక్ దాడి

జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు సత్యసుధామ విచారణ

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల ఎస్‌సి బాలుర హాస్టల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి కొవ్వాకుల తేజను హాస్టల్ కుక్ వెంకటేశ్వరరావు విచక్షణా రహితంగా కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు జిల్లెళ్ల సత్యసుధామ శుక్రవారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే రాజమండ్రికి చెందిన కొవ్వాకుల తేజ 20 రోజుల క్రితం కాళ్ల ఎస్‌సి బాలుర హాస్టల్లో చేరాడు. ఈ నెల 12వ తేదీన తేజ పుస్తకాలకు అట్టలు వేసుకోవాలని స్కూల్‌కు వెళ్లకపోవంతో స్కూల్‌కు వెళ్లాలని కుక్ వెంకటేశ్వరరావు చెప్పాడు. తేజ వినకపోయేసరికి వెంకటేశ్వరరావు పివిసి పైపుతో విచక్షణా రహితంగా కొట్టి గదిలో బంధించాడు. విద్యార్థులు స్కూల్ నుంచి వచ్చి గది తలుపు తీసి బయటకు తీసుకొచ్చి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లి టిసికి దరఖాస్తు చేసి తేజను రాజమండ్రి తీసుకెళ్లిపోయారు. అనంతరం విషయాన్ని వారు జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు సత్య సుధామ జిల్లెళ్ల దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాన్ని సందర్శించామని, హాస్టల్ వార్డెన్ ఇదంతా నిజమేనని చెప్పారని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడామని, వెంకటేశ్వరరావు తరచూ విద్యార్థుల పట్ల సైకోలా ప్రవర్తిస్తాడని తెలిపారని చెప్పారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.



విద్యార్థి తేజ శరీరంపై కనిపిస్తున్న దెబ్బలు



కుక్ వెంకటేశ్వరరావును విచారణ చేస్తున్న జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు సత్యసుధామ

శ్మశానవాటికలపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ఉండి: రాష్ట్రంలో దళితులు నివసించే గ్రామాల్లో శ్మశానవాటికలు లేనిచోట కొత్త శ్మశానవాటికలను ఏర్పాటు చేయాలని ఎపి క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల దళితనేత కోనాల ఏసేబు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దళిత ప్రాంతాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడమే కాదు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఆక్రమణలకు గురైన దళిత శ్మశాన వాటికలను గుర్తించి వెంటనే అధికారులు దళితులకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నో శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురయ్యాయని, ప్రభుత్వాధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన కోరారు.

ర్యాంకింగ్‌లో ఎస్ఆర్‌కెఆర్‌కు మూడోస్థానం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశంలో ప్రతిష్టాకరమైన టైమ్స్ గ్రూప్ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించిన టైమ్స్ ఇనిస్టిట్యూట్స్ ర్యాంకింగ్ సర్వే 2023లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు మూడో ర్యాంకు ప్రకటించిందని శుక్రవారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె నిషాంతవర్మకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిషాంత్ వర్మ మాట్లాడుతూ కెరీర్ 360 సంస్థ కూడా నిర్వహించిన సర్వేలో తమ కళాశాలకు ట్రిబుల్ ఎ ప్లస్ ర్యాంక్ ప్రకటించిందని తెలిపారు. ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థులు ప్లేస్మెంట్స్, ప్రయోగశాలలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ర్యాంకులు ప్రకటించారన్నారు. కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు రామరాజు (రాంబాబు) మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె నిశాంత్ వర్మ, ప్రిన్సిపల్ జగపతి రాజు, కళాశాల స్టాఫ్‌కు అభినందనలు తెలిపారు.

16న మార్టేరులో టిడిపి బహిరంగ సభ

ప్రజాశక్తి - పెనుమంట్ర


ఈ నెల 16వ తేదీన భవిష్యత్తు గ్యారంటీపై టిడిపి ప్రచార బస్సు యాత్ర అనంతరం మార్టేరు పాత వంతెన సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి (బుల్లాలు) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు ఆచంట అగ్రికల్చర్ మార్కెట్ యార్డు నుంచి భవిష్యత్తు గ్యారంటీ ప్రచార బస్సు యాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ బస్సు యాత్ర తోపాటు ఆచంట నియోజకవర్గ స్థాయిలో మోటార్ సైకిల్ ర్యాలీ జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు పితాని సత్యన్నారాయణ పాల్గొంటారని తెలిపారు. అలాగే జోన్-2 ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ఎంఎల్ఎలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, పార్లమెంట్ ఇన్‌ఛార్జిలు, మాజీ ఎంఎల్‌సిలు ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ఈ ర్యాలీ ఆచంట నుంచి ములపర్రు, ఇలపర్రు, సిద్ధాంతం, రామన్నపాలెం, వడలి, వెంకటరాంపురం, పెనుగొండ, నెగ్గిపూడి మీదుగా మార్టేరులో అయ్యప్పస్వామి ఆలయం వద్ద ముగిస్తుందని తెలిపారు. టిడిపి కార్యకర్తలు, నేతలు సభను విజయవంతం చేయాలని కోరారు.

పోడూరు: ఆచంట నియోజకవర్గ పరిధిలో ఈ నెల 16వ తేదీన జరగనున్న టిడిపి భవిష్యత్ గ్యారెంటీ బస్సు యాత్రను, అదే రోజు సాయంత్రం మార్టేరులో మాజీ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు కోరారు. శుక్రవారం పోడూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రుద్రరాజు రమేష్‌రాజు, బొక్కా సూర్యనారాయణ, దొంగ సూర్య ప్రసాద్, రుద్రరాజు వరహాల రాజు, కొండేటి చల్లారావు పాల్గొన్నారు.

ఉచితంగా డ్రోన్ పైలెట్ శిక్షణ

ప్రజాశక్తి - వీరవాసరం

వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం ఉచితంగా డ్రోన్ పైలెట్ శిక్షణ ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి బిన్నీబాబు తెలిపారు. మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి కౌలు రైతులకు రైతు భరోసా వర్తిస్తుందని, అర్హులైన కౌలురైతులు, రైతులు ఆర్‌బికెల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా రైతుల నాట్లు పూర్తయిన తరువాత పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి బిన్నిబాబు మాట్లాడుతూ డ్రోన్ పైలెట్ శిక్షణకు ఇంటర్మీడియట్ పూర్తి చేసి పాస్‌పోర్టు ఉన్నవారు అర్హులన్నారు. అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. సాగునీటి ఇబ్బందులు లేకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని, పిఎం కిసాన్ ఇకెవైసిని నమోదు చేసుకోని వారు ఈ నెలాఖరుగా చేసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు, సలహా మండలి సభ్యులు, వెటర్నరీ, ఫిషరీస్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



నాగమురళీ శ్రీనివాసరావును సత్కరిస్తున్న సభ్యులు

హెచ్ఎం నాగమురళీ శ్రీనివాసరావుకు సత్కారం

కాళ్ల : ప్రాతళ్లమెరక మెయిన్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుడు బెల్లంకొండ నాగమురళీ శ్రీనివాసరావు ఎనలేని కృషి చేశారని ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు అన్నారు. ప్రాతళ్లమెరక మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఇటీవల బదిలీపై వేంపాడు పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుకు సత్కార సభ శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ప్రాతళ్లమెరక మెయిన్ పాఠశాలకు చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం గ్రామ టిడిపి అధ్యక్షుడు కంతేటి శ్రీనివాసరాజు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు రూ.15 వేల విలువైన విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా దాత కంతేటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ కాన్వెంట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్యనందించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని కళ్యాణి, కంతేటి సుబ్బరాజు, గొట్టుముక్కల శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డిగ్రీలో హానర్స్ కోర్సు

పాలకొల్లు: ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ కోర్సులకు పోటీగా కేంద్ర ప్రభుత్వం డిగ్రీలో హానర్స్ కోర్సు తీసుకొచ్చిందని పాలకొల్లు ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నర్సింహారావు చెప్పారు. శుక్రవారం ఛాంబర్ కళాశాలలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొత్త విద్యాపాలసీకి అణుగుణంగా విదేశాల్లో కూడా గ్రాడ్యుయేట్లు పీజీ కోర్సులు చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. అయితే ప్రచారం తక్కువగా ఉన్నందున తక్కువ అడ్మిషన్లు అవుతున్నట్లు చెప్పారు. కళాశాలల్లో బోధకుల జీతాలు, అన్ని వస్తువుల ధరలు భారీగా పెరిగిన ప్రభుత్వం అవగాహన లేకుండా ఫీజులు తగ్గించడం వల్ల తాము నష్టాల్లో ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 15, 16 తేదీల్లో తమ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కలిదిండి రామరాజు రామలింగేశ్వరరావు, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కృష్ణబలిజ సంక్షేమానికి కృషి చేస్తాం

ఆచంట: కృష్ణబలిజ సామాజికవర్గ సంక్షేమానికి కృషి చేస్తామని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. కొడమంచిలి పంచాయతీ పరిధి బండివారిపాలెంలో ఉన్నా కృష్ణబలిజ సామాజికవర్గ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు స్థలం కేటాయించినట్లు తెలిపారు. గ్రామంలోని కృష్ణబలిజ అభివృద్ధి కోసం ఎల్లపుడూ కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థలం కేటాయించిన పత్రాన్ని సర్పంచి సీతారాం కృష్ణబలిజ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడమంచిలిలో నాలుగున్నర సంవత్సరాల్లో నవరత్నాల ద్వారా సుమారు రూ.45 కోట్లు నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో నగదు జమచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి డి.నాని, వైసిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కొండేటి రమేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మొగల్తూరు: కాళీపట్నం గ్రామంలో ఈ నెల 15వ తేదీ శనివారం హెర్మోన్ లివింగ్ వాటర్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ఫౌండర్ చైర్మన్ బిషప్ కోమనపల్లి జోసఫ్‌రాజు, కో ఫౌండర్ చైర్మన్ కోమనపల్లి స్వర్ణగీత తెలిపారు. కాళీపట్నం పడమరలోని పాఠశాల ఆవరణలో సంస్థ ఈ శిబిరాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ శిబిరంలో జనరల్ వైద్య పరీక్షలను ప్రముఖ వైద్య నిపుణులు నికోలేస్ ఇజ్రాయేల్, సురేఖ నికోలాస్ కొమనపల్లి ఈ శిబిరంలో వైద్య సేవలు అందిస్తారన్నారు. గ్రామంలోని చుట్టు పక్కల ప్రజలకు ఉచితంగా ఆటో సౌకర్యం కల్పించామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి మహాప్రభో..!

వాండ్రం గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - ఉండి

తమ గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బి రహదారికి మరమ్మతులు చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను వాండ్రం గ్రామస్తులు వేడుకుంటున్నారు. వాండ్రం గ్రామం వెళ్లాలంటే సప్తసముద్రాలు దాటినట్లు అవుతోందని వాపోతున్నారు. వచ్చే మార్చి నాటికి ఏ రోడ్డు చూసినా గుంతలు లేకుండా చూస్తానన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటన నేటికీ నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉండి నుంచి వాండ్రం వరకూ ఆర్అండ్‌బి రోడ్డు అత్యంత దారుణంగా అడుగుకో గుంత మారిందని, దీంతో రోడ్డంతా అస్తవ్యస్తంగా ఉందని రోడ్డు పొడవునా ఉన్న గుంతల్లోకి వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయని, రాత్రిపూట ఆదమర్చి వాహనాన్ని నడిపితే ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయం భయంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇటీవల ఆ గుంతల్లో పడి కొందరు కాళ్లు, చేతులూ విరగ్గొట్టుకున్న సంఘటనలు చాలా జరిగాయి. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అంబులెన్స్ కూడా రావడానికి ఆలోచించుకునే పరిస్థితి వచ్చిందని, ఊర్లోని కొంతమంది దాతలు వారి కంపెనీలకు వెళ్లే వరకూ రోడ్లు వారే వేసుకున్నారని తెలిపారు. ఈ రహదారి నిర్మించాలని ఎవరైనా అడిగితే వారికి ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు ఆపుతారని భయంతో ఎవరు ఏం చేయలేకపోతున్నామని కొందరు బాహాటంగానే చెబుతున్నారు. కనీసం ఈ రోడ్డు పునర్నిర్మాణం చేపట్టకపోయినా పరవాలేదు గాని మరమ్మతులు చేపట్టాలని రోడ్లు భవనాల శాఖ అధికారుల కోసం రోజుల తరబడి తిరిగినా ప్రయోజనం లేకపోయిందని అధికారులు అందుబాటులో ఉండటం లేదని పలువురు చెబుతున్నారు.



ఉండి నుంచి వాండ్రం వెళ్లే రహదారి



సీసలిలో వరిచేలో కొంగల గుంపు

పొలమంతా.. కొంగల కొలువు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రకృతిలో అన్ని జీవ రాశులూ ముఖ్యమైనవే. కొన్ని జీవరాశులు మనకు మేలు చేస్తాయి. కొన్ని కీడు చేస్తాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడడం కోసం మేలు చేసే వాటిని సంరక్షించుకోవాలి. కొన్ని పక్షులు కాలాన్ని బట్టి పయనిస్తూ ఉంటాయి. వరి చేల్లో ట్రాక్టర్‌తో దుక్కు దున్నినప్పుడు ఎక్కువ సంఖ్యలో కొంగలు వాలుతుంటాయి. పొలంలోని హానికర పురుగులను ఏరుకుని తింటూ రైతులకు మేలు చేస్తాయి. గురువారం కురిసిన వర్షాలకు సీసలి, కాళ్ల, జక్కరం, కోపల్లె గ్రామాల్లో పొలాల్లో దమ్ములు చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఆ సయయంలో ఒక్కసారిగా అధిక సంఖ్యలో కొంగలు రావడంతో చూపరులను కనువిందు చేశాయి.

ఉండిలో జగనన్న సురక్ష శిక్షణ తరగతులు

ఉండి: ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా అధికారులు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని జగనన్న సురక్ష మండల కన్వీనర్ బులుసు వెంకట రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఉండి గ్రామ పంచాయతీలో వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి, సచివాలయ కన్వీనర్లకు, గృహసారధులకు జగనన్న సురక్షపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రామకృష్ణ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వాలంటీర్లు సచివాలయ సిబ్బంది, ప్రజల సమస్యలను తెలుసుకోవడం ద్వారా అధికారులు వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ వర్మ, ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో ఎంఎల్‌సి శివానందరెడ్డి

భీమవరం రూరల్ : మావుళ్లమ్మ అమ్మవారిని కడప జమ్మలమడుగు ఎంఎల్‌సి శివానందరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ ధర్మకర్త తాళ్లపూడి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలి : డ్వామా పీడీ

ప్రజాశక్తి - ఉండి

లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగంగా చేపట్టాలని డ్వామా పీడీ, గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ ఎం.రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం వెలువర్రు పరిధిలోని గరువు ప్రాంతంలో ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పూడిక పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరువు ప్రాంతంలో అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి 7.45 ఎకరాల స్థలాన్ని సేకరించామని, ఆ స్థలంలో పూడిక పనులు జరిగిన వెంటనే లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ ప్రాంతంలో ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన 240 మంది లబ్ధిదారులు, మహదేవపట్నం గ్రామానికి చెందిన 8 మంది లబ్ధిదారులు, వెలివర్రు గ్రామానికి చెందిన 16 మంది లబ్ధిదారులు ఉన్నారని, వారందరికీ తొందరలోనే లేఅవుట్ పనులు పూర్తిచేసి మౌలిక వసతులు సమకూర్చి వారికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎఇ రామకృష్ణరాజు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ దాసరి నందన్, ఉపాధి హామీ మండల టెక్నికల్ అసిస్టెంట్ ఒమేగా రాజు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానంతో మేలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సమగ్ర వ్యవసాయ విధానంతో రైతుకు మేలు జరుగుతుందని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ తోలేటి జానకీరామ్ అన్నారు. వెంకట్రామన్నగూడెంలో వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో పశుగ్రాస వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జానకీరామ్ మాట్లాడుతూ వ్యవసాయం, ఉద్యానం, పాడి వివిధ రకాల కార్యకలాపాలన్నింటినీ సమీకృతం చేయడం ద్వారా రైతుకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పంటతో పాటు పాడి రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రం హార్టీకల్చర్ హబ్‌గా ప్రసిద్ధి చెందిందన్నారు. కూరగాయలు, పండ్లు ఉత్పత్తిలో దేశంలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా 75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో 14.36 టన్నుల పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గేదెల పరిశోధనా స్థానం ప్రిన్సిపల్, సైంటిస్ట్ ఆనందరావు మాట్లాడుతూ ఇక్కడ 60 ఎకరాలలో సూపర్ నేపియర్ పశుగ్రాసాన్ని సాగుచేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు కూడా సరఫరా చేస్తున్నామన్నారు. ఈ పశుగ్రాసంతో పశువులకు పోషక విలువలు అందడమే కాకుండా అధిక పాల దిగుబడి ఇస్తాయన్నారు. అనంతరం ముగ్గురు ఉత్తమ పశుగ్రాస పెంపకం దారులకు అవార్డులు అందజేశారు. రైతులకు పశు గ్రాస కనుపులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, హార్టికల్చర్ యూనివర్సిటీ విస్తరణ సంచాలకురాలు ఇ.కరుణశ్రీ, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు విజయ భాస్కర్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

సచివాలయం వద్ద వ్యక్తి ఆందోళన

ప్రజాశక్తి - మొగల్తూరు

లీజుకు తీసుకున్న వ్యక్తులు తన భూమిని ఆక్రమించుకున్నారని, అధికారులు తన భూమిని తనకు ఇప్పించాలని పాలపర్తి కోటేశ్వరరావు పేరుపాలెం సౌత్ సచివాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ మోళ్లపర్రులోని తన కుటుంబానికి రెండెకరాల భూమి ఉందని, ఆ భూమిని 2015లో తన తండ్రి పెద్దింట్ల వద్ద నుంచి గ్రామానికి చెందిన వైసిపి మండల అధ్యక్షుడు కర్రి ఏసుబాబు, అనుచరులు అంద్రాజ్ వెంకటనారాయణ, శంకరపు నాగరాజు, అంద్రాజ్ దాసు లీజుకు తీసుకున్నారని తెలిపాడు. లీజు గడువు పూర్తయినా తన భూమిని తనకు అప్పగించకపోవడంతో కోర్టులో దావా వేశామని, కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. అయినా అధికారులు తనకు భూమిని స్వాధీనం చేయడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరాడు. అనంతరం తహశీల్దార్ జి.అనిత కుమారి ఆందోళనకారుడితో మాట్లాడారు. సర్వే చేసి రెండు రోజుల్లో భూమి అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారుడు ఆందోళన విరమించాడు. కోటేశ్వరరావుకు మద్దతుగా దళిత సంఘ నాయకులు యడ్ల చిట్టిబాబు పలువురు ఉన్నారు.

రంగంనాయుడుకు అవార్డు

ప్రజాశక్తి - పాలకోడేరు

అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని, ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని డాక్టర్ సిహెచ్‌వి రంగంనాయుడు అన్నారు. జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యుడు రంగంనాయుడుతో పాటు ఎఎన్ఎం సామ్రాజ్యం, లక్కీడిప్ వ్యాసెక్టమీ చేయించుకున్న వ్యక్తికి ప్రోత్సాహక అవార్డు లభించింది. దీంతో పాలకోడేరు పిహెచ్‌సి మరో వైద్యురాలు డాక్టర్ స్వర్ణనిరంజని ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది డాక్టర్, ఎఎన్ఎం శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా రంగం నాయుడు మాట్లాడుతూ బెస్ట్ మెడికల్ ఆఫీసర్‌గా ఇప్పటికే ఎనిమిది అవార్డులు తీసుకున్నానన్నారు. తన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించినందుకు జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సత్యనారాయణ, పిహెచ్ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు శంకర్, శ్రీనివాస్, అమ్మాజీ, నాగమణి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అభివృద్ధి సంస్థ చైర్మన్

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్రప్రదేశ్ శాలివాహన, కుమ్మరి సంక్షేమం, అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం.పురుషోత్తం, కమిటీ సభ్యులు శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలివాహన సంస్థ చైర్మన్, కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతూ శాలివాహన, కుమ్మరి కమ్యూనిటీ ప్రజలందరూ ప్రభుత్వ నవరత్నాలను పొందుతున్నారని, కమ్యూనిటీ ప్రజలు అన్ని అంశాల్లో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జివిఎస్ కె.గణపతిరావు, శాలివాహన కమిటీ సభ్యులు బిరుదుకోట చింతన్న, పెనుగొండ లక్ష్మి, సకినేటిపల్లి ఉమా మహేశ్వరరావు, యర్రవరపు రామకృష్ణ పాల్గొన్నారు.

గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెనుగొండ

దొంగరావిపాలెం బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు గ్రామానికి చెందిన మాకిరెడ్డి రాజేష్ (23) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. వచ్చిన ఆదాయాన్ని షేర్ మార్కెట్లో పెడుతూ నష్టపోవడంతో తండ్రి దానయ్య గతంలో మందలించాడు. మూడు రోజుల క్రితం మరలా షేర్ మార్కెట్లో డబ్బులు పోవడంతో తండ్రి మందలిస్తాడనే భయంతో గురువారం సాయంత్రం పెనుగొండ మండలం, దొంగరావిపాలెం బ్రిడ్జి పైనుండి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి దానయ్య ఫిర్యాదు మేరకు గోదావరిలో గాలించి మృతదేహాన్ని వెలికి తీశామని ఎస్ఐ రమేష్ తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. మృతుడు రాజేష్‌కు వివాహం కాలేదు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం, కార్పొరేట్ కంపెనీలు విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని శాసనసభ్యులు మంతెన రామరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 13 ప్రయివేట్ కార్పొరేట్ కంపెనీలు రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థలు సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ రామరాజు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెలలో 300 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా 113 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీ కార్యదర్శి పిబి.ప్రతాప్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి జిల్లా అధికారి ఎ.కృష్ణారెడ్డి, కళాశాల డెవలప్మెంట్ సెక్రటరీ నంబూరు వెంకటరామరాజు బాబు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వారంలో ఒక రోజు ఫ్రైడే డ్రైడే పాటించాలని పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 33, 34, 35, 10, 12 వార్డుల్లో అవగాహనా కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఫీవర్ సర్వేతోపాటు కీటక జనిత ప్రదేశాలను గుర్తించి వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది అనుమానిత జ్వరం కేసులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి వైద్య బృందాలకు జ్వరాలపై సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఫైలేరియా రోగులకు ఉపశమన వస్తు సామగ్రి టబ్, మగ్, టవల్, సోప్, ఆయింట్మెంట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు ఇన్‌ఛార్జి కె.నరసింహలక్ష్మి, వార్డు ఆరోగ్య కార్యదర్శులు బేబీ, మేరీ, జ్యోతి, రాజేశ్వరి పాల్గొన్నారు.